
ప్రజాశక్తి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



ధాన్యం కొనుగోలు చేయండి

సబ్‌కలెక్టర్‌కు ఎమ్మెల్సీ వినతి

ప్రజాశక్తి-పాలకొండ

గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోలు చేయక పోవడం పట్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాలవలస దవళేశ్వరరావు, వి.రాజారావు, లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

భూ దందా

మండలంలో మరో భూబాగోతం బయటపడింది. అమాయక దళితులకు డబ్బు ఆశచూపి లీజు ముసుగులో సుమారు 40 ఎకరాలను తీసుకున్న ఓ నాయకుడు లీజుకాలం పూర్తయ్యాక ఆ భూముల ను దళితులకు తిరిగి అప్పగించకుండా ఇబ్బంది పెడుతున్నాడు. లీజు సమయంలో ఖాళీ స్టాంప్ పేపర్లపైన, ప్రామిసరీ నోట్లపైన చేయించు కున్న సంతకాలను బూచీగా చూపిస్తూ బ్లాక్ మెయిల్ కు దిగుతున్నాడు. అంతేకాకుండా, సదరు దళితుల భూమిలో గిరిజన యూనివర్సిటీ రానుండడంతో ప్రభుత్వం ఇచ్చే పరిహారంలో సగం మొత్తం తనకు ఇవ్వాలని, లేకపోతే ఒక్క రూపాయి కూడా రాకుండా చేస్తానని బెదిరిస్తున్నాడు. అంతటితో ఆగకుండా వారి బ్యాంక్ ఖాతాలను కూడా తనకున్న పలుకుబడి తో హోల్డులో పెట్టించి వారిని మానసిక క్షోభ కు గురిచేస్తున్నాడు. దళితుల వద్ద ఆ నాయకుడు లీజుకు తీసుకున్న భూమిని విశాఖకు చెందిన ప్రముఖ వైద్యునికి 99 ఏళ్లకు లీజుకు ఇచ్చేశాడు.



ఆవేదన వ్యక్తంచేస్తున్న బాధిత దళితులు


- దళితుల భూమిపై వైసిపి నాయకుడి కన్ను
- లీజు ముసుగులో ఆక్రమణ
- గడువు ముగిసినా భూములు తిరిగిచ్చేందుకు ససేమిరా
- పోలీసుల జోక్యంతో పాసు పుస్తకాలు వెనక్కి
- మరోవైపు 20 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- దళితులపై ఆగని వేధింపులు
- కలెక్టర్, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు

ప్రజాశక్తి-మెంటాడ

2016లో ఆగూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడొకరు ఓ భూస్వామి అండతో కుంటినవలసకు చెందిన దళితుల భూములపై కన్నేశాడు. ఎకరాకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున మూడేళ్ల కాల వ్యవధి 2019 వరకు లీజుకు తీసుకున్నారు. నిరుపేదలైన వారంతా ఆర్థిక సమస్యల నేపథ్యంలో స్థానిక వైసిపి నాయకుడి మాటలను నమ్మి లీజుకు ఇచ్చారు. ఆ సమయంలో ఆ నాయకుడు ఖాళీ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లపై ఆ దళితులతో సంతకాలు/ వేలిముద్రలు వేయించుకున్నారు. ఖాళీ ప్రామిసరీ నోట్లపైనా ఇలాగే చేయించుకున్నారు. దీనివెనుక మర్మాన్ని గ్రహించలేని ఆ దళితులు గుడ్డిగా సంతకాలు, వేలిముద్రలు వేసేశారు. వైసిపి నాయకుడి సాయంతో ఆ భూస్వామి 40 ఎకరాలతోపాటు వాటిని ఆనుకొని ఉన్న మరో 20 ఎకరాల భూమిని కబ్జా చేసేసాడు. మొత్తం 60 ఎకరాలను హస్తగతం చేసుకోవాలని పన్నాగం పన్నాడు.

దళితులపై కక్ష సాధింపు

ఈనేపథ్యంలో దళితుల పట్ల ఆ నాయకుడు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సేకరించిన భూమిలో ఆ దళితులకు చెందిన 40 ఎకరాలు భూములు కూడా ఉన్నాయి. భూములకు పరిహారం ఇస్తామని సర్కారు చెప్పడంతో ఆ దళితులు వారి భూములు



ఖాళీ ప్రాంశరీ నోటుపై తీసుకున్న సంతకాలు

ఇచ్చేందుకు సమ్మతించారు. ఆ భూములకు పరిహారం విడుదల కానుండడంతో సగం మొత్తం తనకు ఇవ్వాల్సిందేనని ఆ నాయకుడు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. లేదంటే ఒక్కరూపాయి కూడా రానివ్వకుండా చేస్తానని బెదిరిస్తున్నాడని దళితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అప్పలనర్సయ్యకు కూడా ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారని బాధిత దళితులు అంటున్నారు

బ్యాంకు ఖాతాలు హోల్డు

పరిహారంపై కన్నేసిన ఆ నాయకుడు తన పలుకుబడితో సదరు దళితుల బ్యాంకు ఖాతాలను హోల్డులో పెట్టించాడని దళితులు తెలిపారు. పరిహారంలో సగం తనకు ఇచ్చేందుకు ఒప్పుకునే వరకు హోల్డులోనే ఉంటాయని బెదిరిస్తున్నాడని తెలిపారు.

చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్

ఈ విషయమై తహశీల్దార్ ఆదిబాబును వివరణ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. వైసిపి నాయకుడు 20 ఎకరాల భూమి ఆక్రమించినట్లు వస్తున్న ఆరోపణలపై దృష్టి సారిస్తామని తెలిపారు. అందరికీ పరిహారం కోసం సిఫార్సు చేశామని, కొందరికి పరిహారం సొమ్ము వారి ఖాతాల్లో జమైందని తెలిపారు.

లీజుకాలం దాటాక ససేమిరా..

దళితుల వద్ద లీజుకు తీసుకున్న భూముల లీజుకాలం ముగిసిన నేపథ్యంలో 2020లో తమ భూములపైకి వెళ్లారు. ఆ భూములిచ్చేందుకు ఆ నాయకుడు నిరాకరించడంతో పాటు ఖాళీ స్టాంప్ పేపర్లు, ప్రామిసరీ నోట్లపై సంతకాల ను బూచీగా చూపి బెదిరించడంతో బాధిత దళితులు పోలీసులను ఆశ్రయించారు. అప్పుడు అసలు విషయం బయటకు వచ్చింది. విశాఖకు చెందిన ప్రముఖ వైద్యునికి ఎకరా రెండు లక్షలు చప్పున 99 ఏళ్ల లీజు ఒప్పందం కుదుర్చుకున్నట్లు బయటపడింది. పోలీసు పంచాయతీలో వారిదగ్గర అట్టిపెట్టుకున్న దళితుల పట్టాదారు పుస్తకాలను తిరిగి వారికి అప్పగించారు.

సురేష్‌బాబుకు మరో ఛాన్స్

ఎమ్మెల్సీగా మళ్లీ అవకాశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు)కు ఎమ్మెల్సీగా మరో ఛాన్స్ దక్కింది. స్థానిక సంస్థలు, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల అభ్యర్థుల జాబితాను వైసిపి నాయకులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం ప్రకటించారు. అందులో ప్రస్తుతం మన జిల్లా నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా వున్న సురేష్‌బాబు పేరును ఖరారు చేసినట్టు పేర్కొన్నారు. వాస్తవానికి ఆయన పదవీ కాలంలో మార్చి 29వ తేదీ వరకు ఉంది. ఆ తరువాత కొత్తగా ఎన్నికలు జరగనున్నాయి. దీనిపై కసరత్తుచేసిన వైపిపి అధిష్టానం నెల రోజులు ముందే జాబితాను ప్రకటించింది. ఎమ్మెల్సీ కోటాలో సురేష్‌బాబుకు మరోసారి అవకాశం దక్కడం పట్ల ఆయన అనుచరుల్లో హర్షం వ్యక్తమౌతోంది. పదవీ కాలంలో వివాద రహితుడిగా, సౌమ్యుడిగా సురేష్‌బాబు పేరొందారు. ఈయన తండ్రి కీర్తిశేషులు పెనుమత్స సాంబశివరావు తండ్రి జిల్లాలో ఒకప్పుడు కాకలు తీరిన నాయకుడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సార్లు మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్‌ను వీడి వైసిపి ఆవిర్భావం నుంచీ జెండా పట్టుకున్నారు. ఆయన మరణం తరువాత సురేష్‌బాబుకు వైసిపి అధినేత సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. మరోసారి ఎమ్మెల్సీగా పేరును ఖరారు చేయడం విశేషం.



కొండను తవ్వేస్తున్నారు

ఆర్‌డిఒ వద్ద గ్రామస్తుల మొర

ప్రజాశక్తి-మెంటాడ

కొండను తవ్వి గ్రీన్ ఫీల్డ్ ఆరు లైనుల రోడ్డుకు గ్రావెల్ ను ఉపయోగించడం పై మెంటాడ గ్రామస్థులు సోమవారం బొబ్బిలి ఆర్డీవో శేషశైలజను నిలదీశారు. ఈ రోడ్డుకు ఎంత మేరకు గ్రావెల్ తవ్వకం చేపట్టడానికి మైనింగ్ శాఖ అనుమతులిచ్చిందో తెలపాలని ఆమెను నిలదీశారు.ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో మండలానికి సంబంధించి రోడ్లు ఇతరత్రా అభివృద్ధి పనులకు గ్రావెల్ దొరికే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. జక్కువ వద్ద జరుగుతున్న గ్రీన్ ఫీల్డు రహదారి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. గ్రామ సమీపంలో సర్వే నెంబరు 15లో భూములిచ్చిన రైతులకు పరిహారం విషయంలో సమస్యలు వున్నాయని, గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రైతులు అడ్డు తగలడంతో ఆర్డీవో రైతుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని తహశీల్దార్ ఆదిబాబుకు సూచించారు. అనంతరం మెంటాడ మీదుగా వస్తున్న ఆమెను రైతులు కలిసి మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుకిరువైపులా పంటపొలాలకు కాలువ నిర్మాణాలు చేపట్టి, పంట దినుసులను తెచ్చుకునేందుకు రహదారి మార్గాలను ఏర్పాటు చేయాలని రైతులు ఆమెను కోరారు.

శ్మశాన వాటిక స్థలాన్ని అప్పగించండి

మెంటాడ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణదారులు నుంచి అప్పగించాలని మెంటాడ గ్రామస్థులు ఆమెను కోరారు. తహశీల్దార్ ఆదిబాబు ఆధ్వర్యంలో సోమవారం జెసిబి సహాయంతో ఆక్రమణకు గురైన భూమిని చదును చేసేందుకు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఆక్రమణదారులు అడ్డు తగిలారు. గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పనులను చేపట్టిన వారిని అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని తహశీల్దార్ అన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించనున్నట్లు గ్రామస్థులు ఆర్‌డిఒకు, తహశీల్దార్ ఆదిబాబుకు తెలిపారు. శ్మశాన వాటిక స్థలాన్ని అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు, మాజీ సర్పంచ్ రాయిపిల్లి రవిశంకర్, సిరిశెట్టి నారాయణరావు, పతివాడ త్రినాథ్, రెడ్డి రాజగోపాల్, పాండ్రంకి సన్యాసి రావు, ముగడ లింగేశ్వర రావు, గంద్రేటి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తున్న మెంటాడ గ్రామస్తులు

అనధికారిక తనిఖీలను ప్రోత్సహించవద్దు : కలెక్టర్

ఎంఇఒలకు, ఐసిడిఎస్ సిడిపిఒలకు ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

అంగన్వాడీ కేంద్రాల్లో అనధికారిక తనిఖీలను ప్రోత్సహించవద్దని, అధికారిక కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించవద్దని ఐసిడిఎస్ సిడిపిఒలను, ఎంఇఒలను జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. జిల్లాలో ఇటీవల కొన్ని చోట్ల జరిగిన అనధికారిక తనిఖీలపై ఆమె స్పందిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనిఖీలు నిర్వహించే క్రమంలో తప్పనిసరిగా సంబంధిత శాఖ నుంచి లేదా జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనధికారిక వ్యక్తులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు జిల్లా శిశు సంక్షేమ అధికారికి సమాచారం అందించి పూర్వాపరాలు తెలుసుకోవాలని, ఆ తర్వాతే వారికి స్పందించాలని సూచించారు. తనిఖీ రిజిస్టర్ నిర్వహించి వాటిలో తనిఖీకి వచ్చిన వారి వివరాలను తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది అనధికారిక వ్యక్తులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన విషయం తన దృష్టికి రావటంపై స్పందించిన కలెక్టర్ సూర్యకుమారి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా సిడిపిఒలకు, ఎంఇఒలకు సర్క్యులర్లు జారీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

డెంకాడ : చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి , డెంకాడ మండల కన్వీనర్ శ్రీను ఆధ్వర్యంలో సోమవారం గుండాల పేట , దిబ్బగుడ్డి , అక్కివరంలో అంగన్వాడీ సెంటర్ లను పరిశీలించారు. అక్కివరం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వారికున్న హక్కులపై అవగాహన కల్పించడంతో పాటుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద సక్రమంగా అందించాలని అన్నారు.

తారకరత్నకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నందమూరి తారకరత్న మృతి పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. సోమవారం దాసన్నపేటలోని నందమూరి అభిమానుల సంఘం ఆధ్వర్యాన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ నాలుగు పదుల వయసు నిండకముందే ఇక సెలవంటూ వెళ్లిపోవడం బాధాకరమని అన్నారు. ఆయన జ్ఞాపకాలు మాత్రం తెలుగునేలపై ఎప్పటికీ పదిలమేనని అన్నారు. కార్యక్రమంలో నందమూరి అభిమానుల సంఘం అధ్యక్షుడు కాగిత శ్రీనివాస్ రావు, టిడిపి పట్టణ టౌన్ అధ్యక్షులు ప్రసాదుల వర ప్రసాద్, కోండ్రు శ్రీనివాస్, మైలిపిల్లి పైడిరాజు, కనకల మన్మథ, సిమెంట్ రమణ, బంటుపిల్లి రమేష్, ఇప్పిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 112 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన స్పందన (జగనన్నకి చెబుదాం) వినతుల కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించిన 112 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 78 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వినతులపై సత్వరమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం. గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమే

టిడిపి చేతకాని విమర్శలు మానుకోవాలి : డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గంలో ఏ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నానని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం మండలంలోని గంగన్నదొరవలస నుంచి కురుకుట్టి వరకు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు జరిగాయని చెప్పారు. మళ్లీ వైసిపి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో 150 రోడ్లు నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలో 20 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధిపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఏ అభివృద్ధి పనులు జరిగాయో టిడిపి నాయకులు చర్చకు రావాలని అనేకసార్లు సవాల్ చేసినట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. టిడిపి నాయకులు పనికి మాలిన విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, ఇతర నాయకులు ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



గుమ్మలక్ష్మీపురంలోని జిసిసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

జిసిసి అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిసిసి కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిసిసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలను కల్పించాలని కోరారు. కిలో చింతపండు రూ.50కు కొనుగోలు చేయాలన్నారు. కొండచీపుర్లను రూ.80కు కొనుగోలు చేసి దళారుల నుంచి కాపాడాలన్నారు. గిరిజనులు పండిస్తున్న జీడిపిక్కలను కిలో 200 రూపాయలకు కొనుగోలు చేసి, గిరిజన ప్రాంతాల్లో జీడి ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు కొండ ప్రాంతాల్లో కష్టపడి నిత్యం సేకరిస్తున్న పలు రకాల అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం నాయకులు పి. తిరుపతిరావు, బిడ్డిక శంకర్రావు, బిడ్డిక ఆడితో, బి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక జిసిసి కార్యాలయం వద్ద ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ముందుగా గిరిజన సంఘం కార్యాలయం నుంచి జిసిసి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి హారిక గంగాధర్, ఐటిడిఎ ఏరియా అధ్యక్షులు బి.అప్పారావు మాట్లాడుతూ ఏజెన్సీలో దళారులు సాగిస్తున్న దోపిడీని నిరోధించేందుకు ఏర్పాటైన గిరిజన సహకార సంస్థ మద్దతుధర ఇవ్వడం లేదన్నారు. గిరిజనులు గత్యంతరం లేక మోసానికి, దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ లాభాలు అర్జిస్తున్నారని తెలిపారు. స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. గిరిజన సహకార సంస్థ మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిసిసి మేనేజర్ దాసరి కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ ధరల సమస్యను ఎమ్‌డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, బాపన్న పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. విజయనగరం పట్టణం కెఎల్ పురానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేస్తూ తన ఇంటిలో ఒక వ్యక్తి అద్దెకు ఉన్నారని, గత 12నెలలుగా ఇంటి అద్దె చెల్లించలేదని, తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇటీవల ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడని, తన అద్దె డబ్బులు గురించి అడిగితే స్పందించడం లేదని, న్యాయం చేయాలని కోరారు కోరారు. చీపురుపల్లికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేస్తూ ఒక వ్యక్తి తమకు విశాఖ పట్నంలోగల ఇంటిని అమ్ముతానని నమ్మించి, తమ వద్ద నుండి రూ. 33లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నారని, కానీ, ఇంత వరకు ఎటువంటి ఇంటిని తమ పేరున రిజిస్ట్రేషను చేయలేదని, తాము అడగగా, అడ్వాన్సుగాతీసుకొన్న నగదులో రూ. 10 లక్షలు చెల్లించారని, ఇంకనూ రూ. 23 లక్షలు చెల్లించలేదని, న్యాయం చేయాలని కోరారు. బొబ్బిలి పట్టణానికి చెందిన మహిళ ఫిర్యాదు చేస్తూ తన భర్త మరణించిన తరువాత తన కుమారుడు ఆస్తి కొరకు వేధిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. విజయనగరానికి చెందిన ఒక వ్యక్తి ఎస్‌పికి ఫిర్యాదు చేస్తూ తన మొబైల్‌కు వచ్చిన లింకును క్లిక్ చేయడం వలన తన బ్యాంకు ఖాతా నుండి రూ.5.25 లక్షలు పోయినవని, చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్‌పి కేసు నమోదు చేసి, విచారణ చేయాలని, ఫిర్యాదికి న్యాయం చేయాలని 1వ పట్టణ సిఐను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ మరియు ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ జి.రాంబాబు, ఎస్ఐలు వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

సిటియులో మెథడాలజీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ సదరన్ రీజియన్ సెంటర్ ఆధ్వర్యంలో దేశంలో వివిధ విశ్వ విద్యాలయాలనుంచి పరిశోధనా విద్యార్థుల కోసం జరుప తలపెట్టిన ఏడురోజుల రీసెర్చ్ మెథడాలజీ ప్రోగ్రాం సోమవారం స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ప్రాంగణం లో జరిగింది. ముఖ్యఅతిథి గా విచ్చేసిన ఐసిఎస్-ఎస్ఆర్ సదరన్ రీజియన్ డైరెక్టర్ బి.సుధాకర రెడ్డి మాట్లాడుతూ పరిశోధనా విద్యార్థులు పరిశోధనకు సంభందించిన అన్ని అంశాలపైనా అవగాహన, పట్టును పెంచుకోవాలని తద్వారా సమాజానికి ఉపగపడే పరిశోధనలను చేసేలా తమను తాము మలచుకోవాలని అన్నారు. అనంతరం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ మొహమ్మద్ మియన్ మాట్లాడుతూ పరిశోధనాంశాలను ఎంపిక చేసికొని సమయంలోనే అత్యంత సామాజిక ఉపయుక్తమైన అంశాలను, నూతన ఆవిష్కరణలను, సామాజిక స్పృహను మేలుకొలిపే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు సమాజానికి మధ్య అంతరాన్ని తగ్గించాలని, ఆదిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిఎస్ఎస్ ఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ జాకబ్ కళ్ళే, సిటియు కోఆర్డినేటర్ డాక్టర్ బొంతు కోటయ్య, ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ప్రొఫెసర్ మిశ్రా, డాక్టర్ గంగు నాయుడు, డాక్టర్ మన్నాల ప్రసాద్, డాక్టర్ పిఎస్ లత తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐసిఎస్ఎస్ఆర్ సదరన్ రీజియన్ డైరెక్టర్ సుధాకరరెడ్డి

మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఉపగ్రహ శకలాలు, జీవితకాలం ముగిసిన ఉపగ్రహాలు ఎక్కువగా అంతరిక్షంలో మిగిలిపోవడం కొత్త ఉపగ్రహాల ప్రవేశానికి ఒక చిక్కు సమస్య అని, ఇటువంటివి మరెన్నో సమస్యలను పరిష్కరించడం ద్వారా ఉత్సాహవంతులైన అధ్యాపకులు, విద్యార్థులు మంచి భవిష్యత్తుకు బాట వేసుకోగలరని శాస్త్రవేత్త డాక్టర్ పి యస్ ఆర్ శ్రీనివాస శాస్త్రి అన్నారు. పలువురు శాస్త్రవేత్తలు సీతం ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ 'కుతూహలం కలిగి ఉండగలగడం, జ్ఞానాభివృద్ధికి మొదటిమెట్టు' అని అన్నారు. ఐఐయస్‌సి బెంగళూరు ప్రొఫెసర్ డాక్టర్ రాధాకాంత్ పాది మాట్లాడుతూ రాబోవు రోజులలో సాంప్రదాయక విద్యాబోధనలు మరుగున పడిపోతాయని అధ్యాపకులు కొత్త బోధనా విధానానికి ,ప్రాజెక్టులు ద్వారా బోధన కొనసాగించడానికి ,కొత్త ఆవిష్కరణలు చేయడానికి అలవాటు పడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి అద్భుత శాస్త్రవేత్తలు సీతం లో అడుగుపెట్టడం సంతోషదాయకం అని కళాశాల డైరెక్టర్ డా.ఎం.శశిభూషణ రావు అన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

తెర్లాం : 31 సంవత్సరాల క్రితం వారంతా కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా మళ్లీ కలుసుకొని రోజంతా ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. దీనికి మండలంలోని పెరుమాళి ఉన్నత పాఠశాల వేదికైంది. ఈ పాఠశాలలో 1991-92 బ్యాచ్‌లో చదువుకున్న వారంతా ఇప్పటి ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీదేవి అధ్యక్షతన అప్పటి గురువులైన విశ్రాంత ఉపాధ్యాయులు హెడ్ మాస్టర్ ఎ.కృష్ణమూర్తి, పెద్ద తెలుగు మాస్టర్ ఎం.రమణ మూర్తి, చిన్న తెలుగు మాస్టర్ కె. వీర నాగయ్య, లెక్కల మాస్టర్ బి.రాలి నాయుడు, సోషల్ మాస్టర్ వి.వి. అప్పారావు, డ్రిల్ మాస్టర్ ఎం. రామునాయుడులను దుశ్శాలువతో సత్కరించారు. పాఠశాలకు అవసరమైన వస్తువులను సమకూర్చడానికి నిర్ణయం తీసుకున్నారు.

టిడిపి కార్యాలయంపై దాడికి ఖండన

ప్రజాశక్తి -భోగాపురం

గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడిని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా టిడిపి నాయకులు పట్టాభి, కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వైసిపి రౌడీ మూకలను వెంటనే అరెస్టు చేసి, పట్టాభి, టిడిపి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన




సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

డెంకాడ : మండలంలోని గుణుపూరు గ్రామంలో సోమవారం బ్యాంకు లింకేజి హై డోస్‌లోన్ (10లక్షలు దాటి లోన్) తీసుకున్న బిసి సంఘ సభ్యులకు డిపిఎం బంగారమ్మ, ఎసి రాజేష్‌కుమార్ అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, గాంధీ సంఘం సభ్యులు, సర్పంచ్ మండల సర్వసభ నాయకులు సత్యం, సిసి విఒఎలు పాల్గొన్నారు.

తారకరత్న మృతికి టిడిపి సంతాపం

వేపాడ : మండల టిడిపి అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో తారకరత్న మృతి పట్ల టిడిపి నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. బాణాదిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, సిరికి రమణ, జనపరెడ్డి ఈశ్వరరావు, మంచిన అప్పలనాయుడు, గొర్లె నాగరాజు, తాడి కృష్ణ, సేనాపతి అప్పారావు, సూర్యం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రావాడ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భోగాపురం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో మండలంలోని రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 16వరకు పల్నాడు జిల్లా నర్సరావుపేటలో అండర్-14 బాల బాలికల వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో విజయనగరం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. సంపత్ గణేష్, బాలికల జట్టులో పి. ప్రణీత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి. శైలజారాణి, పీడీ చిన్నారి, ఉపాధ్యాయులు అభినందించారు.

అపరాల కొనుగోలు కేంద్రం మంజూరు

బొబ్బిలి : బొబ్బిలి నియోజకవర్గానికి అపరాలు కొనుగోలు కేంద్రం మంజూరైనట్లు వ్యవసాయ సంచాలకులు ఎం.శ్యామసుందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి పిఎసిఎస్ కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుతో ప్రారంభిస్తామన్నారు. రైతులు దళారీలు బారిన పడకుండా కొనుగోలు కేంద్రంలో అపరాలు విక్రయించాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మ్యాథ్స్ బోధించే ఉపాధ్యాయులతో హెచ్ఎం ఎస్ఎస్ వల్లి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పది పరీక్షల్లో గణితంలో అధిక మార్కులు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వేపాడ, ఎల్ కోట, కేజీబీవీ, బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన బైరి విష్ణు ఇటీవల మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద రూ. 10వేలను అతన సతీమణి బైరి వరలక్ష్మికి మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కుటుంబంలో యజమాని మృతి చెందితే ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం ఎంతో భరోసా నిస్తుందన్నారు. కుటుంబం వీధిన పడకుండా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ భీమా పథకం దోహదపడుతుందన్నారు. వీరితోపాటు ఉప సర్పంచ్ గుండ పకీరు, వైసిపి నాయకులు రాయపురెడ్డి శ్రీకాంత్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ, ఉన్నారు.

విసి సమావేశం నిబంధనలకు విరుద్ధం

బొబ్బిలి : ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుండగా ఆంధ్రాయూనివర్శిటీ వీసీ అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల గురించి మాట్లాడం నిబంధనలకు విరుద్ధమని ఎఐఎస్ఎఫ్ఐ జిల్లా సహయ కార్యదర్శి బి. రవికుమార్ అన్నారు. అధ్యాపకులకు సమావేశం ఏర్పాటు చేసి అధికార పార్టీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలుపు కోసం ప్రచారం చేస్తున్న వీసీ పై చర్యలు తీసుకోవాలని బొబ్బిలిలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎలాగైనా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవాలన్న సంకల్పంతో వైసిపి నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేయడం దానికి వీసీ వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వీసీ రిజిస్టర్, ప్రైవేటు డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించడం ఎన్నికల నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమేనన్నారు. వెంటనే వీసీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 14 మంది ఎంపిక

రేగిడి : మండలంలోని సంకిలి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సోమవారం వెంకటేశ్వర, పుష్పగిరి కంటి అసుపత్రి సౌజన్యంతో, సంకిలి షుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆఫ్తాలిమిక్ వైద్యులు నాగరాజ్, అరవింద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 14 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్టు తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, ఆరోగ్య శ్రీ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ తీసుకు రావాలన్నారు. ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు వాహన సదుపాయం, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఏఎన్ఎం జ్యోతి, ఎమ్ఎల్‌హెచ్‌పి ఎం. దుర్గాదేవి, ఆశా కార్యకర్తలు సుశీల, నాగమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛభారత్..?

- నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ లేక వాడని దుస్థితి
- ప్రజాధనం దుర్వినియోగంపై పెదవి విరుపు

ప్రజాశక్తి- రేగిడి

స్వచ్ఛభారత్‌లో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి చేసింది. కొన్ని చోట్ల సామూహిక మరుగుదొడ్లను కూడా నిర్మించారు. అధికారులు వీటి లక్ష్యాలు చేరుకోవడానికి నానా తిప్పలు పడ్డారు. పాత మరుగుదొడ్లకు బిల్లులు ఇచ్చి లక్ష్యాలకు చేరుకున్నారన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మాణాలకు స్థలాలు లేకపోవడంతో సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినందుకు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌ను అధికారులు నియమించారు. ఇందులో భాగంగా లబ్ధిదారుని బిల్లులు కాంట్రాక్టర్‌కు ఇచ్చి మరుగుదొడ్లను నిర్మించారు. ఈ సామూహిక మరుగుదొడ్లు నిర్మాణాలు నాణ్యత లేకపోవడంతో ప్రస్తుతం ఈ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. తునివాడ, చాటాయివలస, తాటిపాడు, తాటిపాడు తోకలవలస, లచ్చన్నవలస తదితర గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు వాడకం లేక పిచ్చు మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు మరుగుదొడ్లు స్లాబులపై కర్రలు, పిడకలు, వంట చెరకు వేయడానికి ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజా ధనం దుర్వినియోగం అయిందని పలువురు పెదవి విరుస్తున్నారు.



లచ్చన్నవలసలో ఇదీ సామూహిక మరుగుదొడ్ల పరిస్థితి

రన్నింగ్ వాటర్ లేకనే..

ఎక్కడికక్కడ సామూహిక మరుగుదొడ్లను నిర్మించిన అధికారులు వాటికి రన్నింగ్ వాటర్ సప్లై పెట్టలేదు. దీంతో అవి వినియోగంలోకి రాలేదు. వాడకుండానే పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని సామూహిక మరుగుదొడ్లకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు వాడకంపై అవగాహన కల్పించకపోవడం ఒక కారణం కాగా రన్నింగ్ వాటర్ లేకపోవడం కూడా వినియోగంలోకి రాకపోవడానికి ఒక కారణంగా చెప్పవచ్చును.


నిరుపయోగంగా 2,281 మరుగుదొడ్లు

మండలంలో 39 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 26 పంచాయితీలలో 7,359 మరుగుదొడ్లు అప్పట్లో పూర్తి చేశారు. ఇందులో దాదాపు 2,281 వరకు మరుగుదొడ్లు థర్డ్ పార్టీ వారికి అప్పగించి నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో 13 గ్రామ పంచాయతీలలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణానికి స్థలాలు లేకపోవడంతో ఒకే చోట సామూహిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. వీటిలో తాటిపాడులో 80 సామూహిక మరుగుదొడ్లు, రేగిడిలో 52, తునివాడలో 30, వెంకంపేటలో 10, చాటాయి వలసలు 15, లక్ష్మం పురం, లింగాలవలస, తోకలవలస తదితర గ్రామాల్లో 15 నుంచి 30 వరకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. వీటికి రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మిగిలిన గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని గ్రామాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.



తునివాడలో నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

పరిశీలించి వినియోగంలోకి తెస్తాం



స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను పరిశీలించి వినియోగంలోకి తెచ్చేలా ఏర్పాట్లు చేపడతాం. మరుగుదొడ్లు వాడని వారికి నోటీసులు జారీ చేస్తాం. సామూహిక మరుగుదొడ్లు థర్డ్ పార్టీ వారు నిర్మాణాలు చేపట్టారు. అటువంటి వాటికి రన్నింగ్ వాటర్ లేకపోవడంతో వాడుక చేయలేదు. సామూహిక మరుగుదొడ్లు కట్టిన గ్రామాల్లో రన్నింగ్ వాటర్ కోసం జిల్లా స్వచ్ఛభారత్ అధికారులకు నివేదిక పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే రన్నింగ్ వాటర్ పనులు చేపడతాం.

గన్నవరపు కాశీ విశ్వనాథరావు, ఎంపిడిఒ రేగిడి

నవధాన్యాల సాగుతో జీవవైవిధ్యం

ప్రజాశక్తి - కొత్తవలస

నవధాన్యాలు సాగు వల్ల భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయని కోఆర్డినేటర్ కె. ఈశ్వరరావు తెలిపారు. సోమవారం చిడివలస గ్రామంలో రైతులతో నవధాన్యాలు సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో తేమ శాతం, కర్బన శాతం పెరగడంతో పాటు దిగుబడి పెరుగుతోందన్నారు. రైతులు ఎటువంటి కృత్రిమ ఎరువులు, రసాయనిక ఎరువులు వినియోగించే అవసరం ఉండదని చెప్పారు. ఏ పంట సాగుచేసిన ఏకపంట విధానం కాకుండా, బహుళ పంటల విధానం చేయాలని ప్రతి పంటలోను వివిధ రకాల పంటలు వేయడం వల్ల చీడపీడలు తగ్గడంతో పాటు రైతుకు పంటలపై దిగుబడి పెరుగుతుందని తెలియజేశారు. రైతుల వద్ద ఉన్న మినుము, పెసలు, ఉలవలు, నువ్వులు, కందులు విత్తనాలతో పాటు కాయగూర విత్తనాలు, చిరుధాన్యలు, జీలుగా, జనుము వరికి ముందు తలకరిలో సుమారుగా 12 నుండి 18 రకాలు విత్తనాలు ఎకరాకు పది నుండి 12 కేజీలు విత్తనాలు వేసినట్లయితే భూమిలో పంటకు అవసరమయ్యే కర్బన శాతం పెరుగుతుందన్నారు. దీనివల్ల పంటలు సంమృద్ధిగా పండుతాయని తెలియజేశారు. అనంతరం రైతులతో నవధాన్యాలు సాగుపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఎన్ఎఫ్‌పి సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సిబ్బంది, రైతులు

స్పందన ఫిర్యాదులపై సూచనలు

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ సమావేశమయ్యారు. సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి సోమవారం వచ్చిన స్పందన ఫిర్యాదులను తప్పనిసరిగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎస్‌డిజి డిఫెన్స్, లో వెయిట్ చిల్డ్రన్స్ వివరాలు, డ్రాపౌట్ విద్యార్థుల వివరాలు, గర్భిణుల వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

దీనికి ముందు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన 139వ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, ఎస్ఐ రాజేష్ పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు.

పాఠశాల పరిశీలన

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్నభోజన మెనూ రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజర పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని బ్యాంకు లావాదేవీలు డిజిటల్ రూపంలో జరిపి కాగిత రహిత నగదు లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకొని ఆదిశగా లబ్ధిదారులందరూ తమ ఖాతాలను వినియోగించు కోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కౌన్సిలర్ పాండ్రంకి తిరుమలరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిధిలోని కొట్టక్కి పిఎసియస్‌లో నాబార్డు సహకారంతో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంక్ పథకాలను, రుణ సదుపాయాలను, ప్రభుత్వ రాయతీలను వివరించారు. సకాలంలో రుణ వాయిదాలు చెల్లించేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసియస్ అధ్యక్షుడు పత్తిగుళ్ళ సత్యనారాయణ, కార్యదర్శి రమేష్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పాండ్రంకి తిరుమలరావు

సోంపురంలో అన్నదానం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అర్చకులు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సోంపురం గ్రామంతో పాటు అరిగి పాలెం, జాకీరు, జగ్గయ్యపేట, కొత్త సింగరాయి, కెత్తన్నపేట గ్రామాల ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వేలాది మందికి అన్నదానం చేస్తామన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కొత్తవలస : మండల యుటిఎఫ్ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం సాయం త్రం జరిగిన ఎన్నికలో గౌరవ అధ్యక్షులు వై.అచ్యుతాంబ, అధ్యక్షులు గా సి.హెచ్.నిర్మలాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.విజయగౌరి, కోశాధికా రిగా యు.అరుణకుమారి, ఉపాధ్యక్షు లుగా పి.అనురాధ, కె.కృష్ణ కుమారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యు లుగా ఎస్. ఎస్.ప్రసాద్, సి.హెచ్. రవికుమార్, వి.సురేష్ కుమార్, ఎస్.వాసు, పి.రమేష్, టి.వినోదకు మార్, మండల కార్యదర్శులుగా ఎస్.నాయుడు బాబు, సి.హెచ్.శ్రీని వాసరావు, కె.రామకృష్ణ రావు, వి.ఎ.ప్రసాద్‌రావు, వై.పద్మావతి, ఎ.జె.రామారావు, కె.శ్రీనివాసరావు, టి.శ్రీదేవి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.సూరి అప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా టి.పద్మావతి, లీల, అప్పారావులు ఎన్నికయ్యారు.

పెట్రోల్ బంక్‌ల పరిశీలన

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం పంచాయతీ పరిధిలోని శ్రీ పద్మజ ఏజెన్సీస్ ఐఒసిఎల్, శ్రీ మహాలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్ లను డిప్యూటీ తహశీల్దార్ పిన్నింటి రామారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్ ద్వారా పెట్రోల్ బంక్‌లను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పెట్రోల్ బంకులు పనిచేయాలన్నారు.



బంకును పరిశీలిస్తున్న డిప్యూటీ తహశీల్దార్

బొబ్బిలి : పెట్రోల్‌లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజారావు హెచ్చరించారు. గ్రోత్ సెంటర్ సమీపంలో ఉన్న హెచ్.పి పెట్రోల్ బంకును సోమవారం ఆయన తనిఖీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించాలని కోరారు. పెట్రోల్ నాణ్యతను పరీక్షించారు. ఆయనతో పౌర సరఫరాల ఉప తహశీల్దార్లు, సేల్స్ ఆఫీసర్లు ఉన్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.39లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల : రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం రూ.39,8,997 వచ్చింది. సోమవారం దేవస్థానం ఆవరణలో పైడి తల్లమ్మ దేవస్థానం సహయ కమిషనర్ బిహెచ్‌విఎస్ఎన్ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో సహయ కమిషనర్ డివివి ప్రసాద్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు సోమవారం జరిగింది. ఈ లెక్కింపులో మహా శివరాత్రి ఉత్సవాలు ద్వారా ప్రత్యేక దర్శనం, కేశఖండన, ప్రసాదాలు అమ్మకం ద్వారా రూ.21,59,560, అన్న ప్రసాదం విరాళాలు ద్వారా రూ.2,12,527 ఆదాయం వచ్చింది. గత నెల 5 నుంచి ఈనెల 20 వరకు 46 రోజులకు గాను హుండీలు తెరచి లెక్కించగా రూ.39,08,997 ఆదాయం వచ్చింది. బంగారం 29 గ్రాములు, 8 కేజీల వెండి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు డి. సత్యనారాయణ రాజు , బుర్లె సత్యం, టి.శ్రీనివాసరావు, నెల్లిమర్ల పోలీస్ సిబ్బంది, ఎపిజివిబి బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

బొబ్బిలి : బొబ్బిలి, దత్తిరాజేరు మండలాల్లో నివాసముంటూ అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్న గిరిజనులకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో బొబ్బిలి ఆర్డిఒ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి తక్షణమే పట్టాలివ్వాలన్నారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, బొబ్బిలి పట్టణ, మండల కార్యదర్శి మున కాల శ్రీనివాస్, ఎండు దొర పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ఉపగ్రహాలపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉప గ్రహాలు కక్ష్యలో ప్రవేశపెట్టడం ఎలా అనే అంశంపై రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పిఎస్ఆర్ శ్రీనివాస్ రెడ్డి వివరించారు. సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సును వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. ఈ సదస్సులో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఉపగ్రహాలు వల్ల కలిగే ప్రయోజనాలు, రానున్న కాలంలో ఎలాంటి ఉపగ్రహాలు కక్ష్యలోకి ప్రవేశ పెట్టబోతున్నామో వివరించారు. సౌర శక్తి దిశగా అడుగులు వేస్తోన్నామన్నారు. బెంగుళూరుకి చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సస్ ప్రొఫెసర్ రాధాకాంత్ పాడి మాట్లాడుతూ భవిష్యత్ అంతా జీవ శాస్త్రం, ఖగోళ శాస్త్రలదేనని అన్నారు. అనంతరం అదితం లక్ష్మణరావు శేషమ్మ స్మారక ట్రస్ట్ ఉపకార వేతనాన్ని అతిథుల చేతుల మీదుగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ కృష్ణ మూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జనసేన, టిడిపి నాయకులు ఎం.ధనుంజయ్, ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ పి.శేష శైలజకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్టక్కి వద్ద జాతీయ రహదారి పక్కనే చెరువును అధికార పార్టీకి చెందిన వారు అక్రమించేస్తు న్నారన్నారు. చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చెరువు అక్రమించేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కొట్టక్కి సమీపంలో గెడ్డను అక్రమించేసి, లిఫ్ట్ ఇరిగేషన్ భూమిని కప్పేసారని కొట్టక్కి గ్రామానికి చెందిన అప్పికొండ బలరాంనాయుడు ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలతో రైతులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు.



ఆర్‌డిఒకు వినతినిస్తున్న నాయకులు

నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి- విజయనగరం

1వ పట్టణం పోలీసు స్టేషన్ పరిధిలో 2018 సంవత్సరంలో నమోదైన వరకట్న వేధింపులతో ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ అదనపు డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి షేక్ శిఖిందర్ భాషా సోమవారం తీర్పు వెల్లడించినట్లుగా 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు తెలిపారు. 2018లో విశాఖకు చెందిన ఒమ్మి కుమారస్వామి 1వ పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తూ తన కుమార్తె దీప్తిను కెమికల్ ప్యాక్టరీలో పని చేస్తున్న బొట్టా రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారన్నారు. వారికి వివాహమై ఆరున్నర సంవత్సరాలు అయినప్పటికీ పిల్లలు లేరని, తన అల్లుడు కుమార్తె కాళీఘాట్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తన అల్లుడు, వారి కుటుంబ సభ్యులు అదనంగా కట్నం కొరకు తరుచూ తన కుమార్తెను వేధింపులకు గురిచేయడంతో ఏప్రిల్ 29, 2018న తన కుమార్తె దీప్తి వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమె ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిరాదు చేశారన్నారు. అప్పటి ఎస్.ఐ. జిఎవి రమణ కేసు నమోదు చేయగా, అప్పటి విజయనగరం డిఎస్‌పి ఎ.వి. రమణ దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేయగా, తరువాత బాధ్యతలు చేపట్టిన డి. సూర్య శ్రావణ్ కుమార్ కోర్టులో నిందితులపై అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బొట్టా రామకృష్ణపై కోర్టులో ఆరోపణలు రుజువుకావడంతో అదనపు డిస్ట్రిక్ట్, సెషన్స జడ్జి షేక్ శిఖిందర్ భాషా నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఈ కేసులో పోలీసులు తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి వాదనలు వినిపించగా, కోర్టు విధులు నిర్వహిస్తున్న 1వ పట్టణ ఎస్ఐ గంగా భవానీ సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరపర్చి, ప్రాసిక్యూషన్ త్వరితగతిన అయ్యే విధంగా సహకారాన్ని అందించినట్లుగా సిఐ బి. వెంకటరావు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని దేశపాత్రునిపాలెం వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా ఇరోతి దేముడు(70) వృద్ధుడు రైలు ఢీకొని సోమవారం మృతి చెందాడు. స్థానికలు అందించిన వివరాలు ప్రకారం.. ట్రాక్ అవతల వైపు ఉన్న పొలంలో మినప చేను తీసేందుకు ఇరోతి దేముడు వెళ్లే క్రమంలో అండర్ బ్రిడ్జిలో పాముల బెడద కారణంగా రైల్వే ట్రాక్ పై నుంచి వెళ్లడంతో రైలు రావడాన్ని గమనించక పోవడంతో ప్రమాదానికి గురై మృతి చెందారని భావిస్తున్నారు. దేముడు ట్రాక్ పక్కన విగత జీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంభ సభ్యులతో మాట్లాడారు. విచారణ అనంతరం మృత దేహాన్ని పోస్ట్ మార్టానికి తరలించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కొత్తవలస

ఇటీవల మతి చెందిన పెదిరెడ్ల సన్నబాబు కుటుంబానికి అయ్యారక యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లంక శ్రీను, కంట్రెడ్డి సన్యాసి పాత్రుడు సమక్షంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పిఎస్ఎన్ పాత్రుడు మాట్లాడుతూ యువజన సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తమ గ్రామంలోనే గతంలో రెండు సార్లు ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు కూడా సహాయం అందించారని ఇప్పుడు చనిపోయిన కుటుంబానికి తమ వంతు ఆర్థిక సహాయంగా డబ్బులు అందించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ సాయాన్ని కుటుంబ సభ్యులు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బంగారు రమేష్, అసోసియేట్ అధ్యక్షులు పెదిరెడ్ల వెంకట సత్యనారాయణ (శ్రీను), గ్రామ నాయకులు పెదిరెడ్ల సూర్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లంక రాములు, ఉపాధ్యక్షులు దన్నిన రవికుమార్, లంక ఈశ్వరరావు, కర్రీ సూర్య నూకరాజు, లంక నర్సింగరావు, సభ్యులు రామదాసు, కాశి, పెదిరెడ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.